సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 14 । జూలై । 2024



నడకా.. నరకమే!

లింగంపేట మండలంలోని పలు తండాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఆయా రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది.

- 9లో ▸



ఎండుతున్న చెరువులు

వర్షాలు కురియకపోవడంతో వాగులు వంకలు పారడం లేదు. దీంతో చెరువులు బోసిపోతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.5 /23.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'పోరాటాల ఫలితమే పదోన్నతులు'



బాన్సువాడ: పోరాటాల ఫలితంగానే తమకు పదోన్నతులు లభించాయని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా పేర్కొన్నారు. శనివారం బాన్సువాడలోని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి. పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాపండితులకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అధ్యక్షులు అరుణ్‌కుమార్, రమణాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ, కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి మంత్రి మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, ప్రతినిధులు గఫూర్, లక్ష్మీనారాయణ, భిక్షపతి, గంట్యాల ప్రసాద్, లాల్‌సింగ్, వంశీధర్, రాములు, సంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి: హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. శనివారం జేఎన్‌టీయూలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

మోడిఫైడ్ సైలెన్సర్లు బిగిస్తే చర్యలు



కామారెడ్డి టౌన్: అధిక శబ్దం చేసే మోడిఫైడ్ సైలెన్సర్లను మోటార్ వాహనాలకు బిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజ్ చేసిన అధిక శబ్దం చేసే సైలెన్సర్‌లను జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రోడ్డు రోలర్‌తో శనివారం ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటారు వాహన చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైలెన్సర్లను బిగించొద్దని హెచ్చరించినా పట్టించుకోవడం లేదన్నారు. మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య

- డీటీ వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్



రామారెడ్డి: కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని తహసీల్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన తెడ్డు ప్రశాంత్ (28) తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని చనిపోయాడు. అతడి వద్ద సూసైడ్ నోట్ లభించింది. తాడ్వాయి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ తనను టార్గెట్ చేసుకున్నారని, ఆయన వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా అందులో పేర్కొన్నాడు. మృతుడు ప్రశాంత్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. 23 రోజుల క్రితమే కుమారుడు జన్మించాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని కామారెడ్డి డీఎస్పీ తెలిపారు.

మిద్దె తోటలో.. ఎన్ని పంటలో..

చుట్టూ పచ్చని వాతావరణం.. ఉదయం లేవగానే పలకరించే పూల చెట్లు.. వంట చేసేందుకు తాజా కూరగాయలు.. పోషక విలువలు అందించే పండ్లు.. ఇవన్నీ మన ఇంటిలోనే అందుబాటులో ఉంటే ఎంత బాగుంటుంది కదూ.. ఊళ్లల్లో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తాయి. కానీ పట్టణాల్లో ఉండేవారికి స్థలాభావంతో అదో అందమైన కల.. కానీ దీనికి కొందరు ప్రత్యామ్నాయంగా మిద్దెనే పెరడుగా మలచుకుంటున్నారు. ఇంటికి అవసరమయ్యే అన్ని రకాల పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మిద్దె తోటలపై 'సాక్షి' సండే స్పెషల్..



కస్వ వెంకటేశం ఇంటి మిద్దెమీద పెంచుతున్న వివిధ రకాల మొక్కలు

సండే స్పెషల్

- ఆరోగ్యం కోసం ఇంటిపంటలపై ఆసక్తి
- కూరగాయలు, పండ్లు, పూల మొక్కల పెంపకం
- పచ్చదనంతో కళకళలాడుతున్న ఇళ్లు



పచ్చని చెట్ల మధ్యన ఉన్న రాజ్‌కుమార్‌రెడ్డి ఇల్లు



పసుపు మొక్కలను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ఆధునిక కాలంలో అన్నింటా పోటీ పెరిగింది. దీంతో విద్య, ఉపాధి అవకాశాల కోసం చాలామంది పట్టణాలకు వలస వెళ్తున్నారు. దీంతో పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలు పెరిగి ఖాళీ స్థలాలు కరువవుతున్నాయి. పట్టణాల్లో చాలామంది ఇంటి పంటలకు దూరమయ్యారు. మార్కెట్లు, సూపర్ మార్కెట్లనుంచి తెచ్చిన పండ్లు, కూరగాయలను ఫ్రిజ్‌లో నిల్వ చేసుకుని రోజుల తరబడి వాడుకుంటున్నారు. అవి కూడా ఎన్నో రకాల క్రిమిసంహార మందులు, రసాయన ఎరువులు వాడి పండించినవే.. వాటిని తినడం వల్ల రోగాల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. చాలామంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. తీసుకునే ఆహారం వల్లే అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రహించిన వారిలో మార్పు వస్తోంది. వారు ఇంటిలోనే కూరగాయలు, పండ్లు పండించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం లేకపోతే మిద్దెనే పెరడుగా మార్చుకుని ఇంటి పంటలు పండిస్తున్నారు.

తీరొక్క పంట..



మిద్దెమీద పెరుగుతున్న చెర్రీ చెట్టు

కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కస్వ లలిత, వెంకటేశం దంపతులు మూడంతస్తుల మీద ఆదర్శ సేద్యం చేస్తున్నారు. పట్టణంలో కిరాణా వ్యాపారంలో మంచి పేరు గడించిన కస్వ వెంకటేశం.. తన అరవయ్యో ఏట వ్యాపార విరమణ చేసి, ఇంటి వద్ద ప్రశాంత జీవనం గడుపుతున్నారు. మార్కెట్‌లో పురుగుల మందులు వాడిన కూరగాయలే లభిస్తుండడంతో ఆరోగ్యం కోసం ఆలోచించారు. కరోనా సమయంలో మిద్దె తోటకు ప్లాన్ చేశారు. మూడో అంతస్తుపైన పెద్ద పెద్ద దిమ్మెలు కట్టించి వాటిలో రకరకాల మొక్కలు నాటారు. కూరగాయలతోపాటు బొప్పాయి, దానిమ్మ, మస్క్ మిలన్, చిన్న ఉసిరి, మామిడి, మొసంబి, సపోట, కలిమికాయ, నిమ్మ, పెద్ద ఉసిరి, బ్లాక్ బెర్రీ వంటి పండ్ల చెట్లనూ పెంచుతున్నారు. వీరి మిద్దె తోటలో కలువ పూలు, పది రకాల గులాబీలు, మల్లెలు కూడా ఉన్నాయి. మర్రి, రావి చెట్లు కూడా పెంచుతుండడం గమనార్హం. మెట్లెక్కి మూడో అంతస్తుకు వెళ్లడం కష్టమని భావించి లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. కోతుల బెడద నివారణకు మిద్దెను రూ. 2 లక్షలతో ఇనుప జాలీతో కప్పేశారు.

ఇంటికి కావలసినవన్నీ పండిస్తాం

మాకు పచ్చదనం అంటే ఎంతో ఇష్టం. ఇల్లు కట్టుకునేటపుడు కొంత స్థలాన్ని పువ్వులు, పండ్ల చెట్ల పెంపకం కోసం వదలాలనుకున్నా కుదరలేదు. అందుకే టెర్రాస్ మీద పంటల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూలు, పండ్లు, కూరగాయలు పెంచుతున్నాం. మూడో అంతస్తులో తోట ఉండడంతో రోజూ మెట్లెక్కడం కష్టమవుతుందని పై వరకు లిఫ్ట్ ఏర్పాటు చేసుకున్నాం. మా ఇంటికి కావలసినవన్నీ ఇక్కడే పండించుకుంటున్నాం. మేమిద్దరం రోజూ కనీసం గంట సేపైనా తోటలో గడుపుతాం. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పండ్లు, కూరగాయలు పండించుకుంటూ సంతృప్తిగా జీవితాన్ని గడుపుతున్నాం. – కస్వ లలిత, వెంకటేశం



కస్వ వెంకటేశం, లలిత దంపతులు

రాజ్‌కుమార్‌రెడ్డి, స్వర్ణలత ఇంటి మిద్దెమీద ప్లాస్టిక్ డబ్బాల్లో కూరగాయల సాగు



కామారెడ్డిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నివసించే స్వర్ణలత, రాజ్‌కుమార్‌రెడ్డి దంపతులు.. పదేళ్ల క్రితం ఇల్లు కట్టుకున్నారు. తమ ఇంటి రెండో అంతస్తును ఉద్యాన క్షేత్రంగా మలచుకున్నారు. మిద్దె తోటలో మిర్చి, బెండ, టమాట, పాలకూర, వంకాయ, బీరకాయ, కాకర, మునగ, పుంటికూర, చిక్కుడు, రత్నపురిగడ్డతోపాటు పసుపు కూడా పండిస్తున్నారు. ఐదారేళ్లుగా వంటకు ఇంటి పసుపే వాడుతున్నారు. పూలమొక్కలకు కొదువలేదు. సీతమ్మ జడపూలు, చేమంతి, లిల్లి, బంతిపూలు.. ఇలా పలు రకాల పూల మొక్కలు పెంచుతున్నారు. వాటర్ యాపిల్, యాపిల్ బార్, జామ, మామిడి చెట్లూ వీరి మి ద్దె తోటలో ఉన్నాయి. ఇంటి ఆవరణలో మామిడి, జామ, కరివేపాకు, సీతాఫలం చెట్లున్నాయి. కాగా కామారెడ్డి పట్టణంలో అంతటా నీటి సమస్య ఉన్నా.. తమ ఇంట్లో మాత్రం నీళ్లకు ఏనాడూ ఇబ్బందులు రాలేదని స్వర్ణలత, రాజ్‌కుమార్‌రెడ్డి దంపతులు చెబుతున్నారు. ఇంటికి రెండువైపులా ఇంకుడు గుంతలు తవ్వించడమే కారణమని పేర్కొంటున్నారు. బోరుకు రెండు వైపులా రెండు భారీ ఇంకుడు గుంతలు ఉండడంతో నీళ్ల సమస్య లేదంటున్నారు.

రోజూ గంటసేపు అక్కడే..

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వాళ్లం. మాకు పచ్చదనం అంటే ఎంతో ఇష్టం. ఊరిని వదిలి వచ్చిన తర్వాత ఇంటినే పంటచేనుగా మార్చుకున్నాం. రోజూ ఉదయం గంటసేపు మొక్కలకు నీళ్ల పట్టడం, కలుపు తీయడం, పండ్లు, కూరగాయలు తెంపుకోవడం వంటి పనులు చేస్తాం. నాలుగైదేళ్లుగా బయట కూరగాయలు, పండ్లు కొన్నదే లేదు. అన్నీ మిద్దె తోటలోనే పండుతున్నాయి. ఐదేళ్లుగా మేడపై పండించిన పసుపే వాడుతున్నాం. మిద్దెపై పెంచుతున్న పంటలకు పూర్తిగా సేంద్రియ ఎరువులే ఉపయో గిస్తు న్నాం. ఇంటి ఆవరణలో పచ్చదనంతో ఎండా కాలంలో కూడా చల్లగా ఉంటుంది. సాయంకాలం సమయంలో ఇంటి ముందు బెంచీల మీద అందరూ కూర్చుని ముచ్చట్లు పెడుతుంటారు. – రాజ్‌కుమార్‌రెడ్డి

ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

కామారెడ్డి టౌన్ : జిల్లావ్యాప్తంగా బదిలీలు అయిన ఎస్జీటీలను తక్షణమే రిలీవ్ చేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రిలీవైన ఎస్జీటీ స్థానంలో విద్యా వలంటీర్లను తక్షణమే నియమించాలన్నారు. అన్ని క్యాడర్లలో బదిలీలు, పదోన్నతులలో సాంకేతిక లోపం వల్ల నష్టపోయిన సీనియర్ ఉపాధ్యాయులకు స్లైడింగ్ అవకాశం ఇవ్వాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్‌హెచ్ పోస్టులను మంజూరు చేసి అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. మిగిలిపోయిన భాషాపండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఎంఈవోలపై పని భారం తగ్గించి ఎంఈవో ఖాళీలన్నీ భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రతీ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య చైర్మన్ యాదయ్య, కో చైర్మన్ కుంట రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పంపరి ప్రవీన్‌కుమార్, కోశఋధికారి దేవులా,నాయకులు సంతోష, రాజేష్, శ్రీనివాస్, ప్రభాకర్, హన్మంత్‌రెడ్డి, విజయరామరాజు, రాజ్‌కుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న సమాఖ్య నాయకులు



వానాకాలంలోనూ భగీరథ ప్రయత్నం

వర్షాకాలం ప్రారంభమై నెల దాటినా భారీ వర్షాల జాడలేదు. రోజూ కమ్ముకొస్తున్న కారు మేఘాలు.. వర్షించకుండానే వెళ్లిపోతున్నాయి. దీంతో చాలాచోట్ల వరి నారు పోసినా నాట్లేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పంటల సాగు కోసం పలువురు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి శివారులో శనివారం బోరుబావి తవ్విస్తుండగా తీసిన చిత్రమిది.. – సాక్షి, కామారెడ్డి

ఇప్పట్లో భరోసా లేనట్లే!

- రైతు భరోసా అమలులో జాప్యం
- విధివిధానాల రూపకల్పనలో కాలయాపన
- జిల్లాల స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు
- 23 వరకు వర్క్‌షాప్‌లు.. ఆపై ప్రభుత్వానికి నివేదిక
- అసెంబ్లీ సమావేశాల్లో చర్చ తర్వాత తుది నిర్ణయం
- ఆగస్టు తర్వాతే పెట్టుబడి సాయం అందే అవకాశం



కామారెడ్డి క్రైం: పంటలు సాగుకోసం పెట్టుబడి సాయం ఇప్పట్లో అందేలా కనిపించడం లేదు! గత ప్రభుత్వం అమలు చేసిన 'రైతుబంధు'లో అనేక తప్పిదాలున్నాయని, మార్పులు చేయాలని భావించిన ప్రస్తుత ప్రభుత్వం పథకం పేరును 'రైతు భరోసా'గా మార్చి ఆ దిశగా చర్యలు చేపట్టింది. అయితే, క్షేత్ర స్థాయిలో పరిశీలన, రైతులు, వ్యవసాయ నిపుణుల అభిప్రాయాలు తీసుకుని నూతన విధివిధానాలను రూపొందించడంలో జాప్యం కారణంగా ఇప్పట్లో రైతులకు 'భరోసా' అందే అవకాశాలు లేకుండాపోయాయి. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పంటలు సాగుచేసే భూములను పరిశీలించే పనిలో ఉండగా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ నెల 23 వరకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలను సేకరించనుంది. రైతుల అభిప్రాయాలతో కూడిన నివేదికపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ అనంతరం విధివిధానాల విషయంలో స్పష్టత రావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావాలంటే ఆగస్టు నెల దాటుతుందని పలువురు భావిస్తున్నారు. పంటల సాగు జోరందుకున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

కొనసాగుతున్న సర్వే

తాము అధికారంలోకి రాగానే ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ.15వేల చొప్పున పెట్టుబడిసాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిది. అయితే, అధికారంలోకి వచ్చిన కొత్తలో గత యాసంగి సీజన్‌కుగాను పాతపద్ధతిలోనే ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించింది. వానాకాలం నుంచి ఎకరానికి రూ.15వేల చొప్పున పెట్టుబడిసాయం అందజేయాలని నిర్ణయించింది. అయితే, పథకంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం రోడ్లు, గుట్టలు సాగుయోగ్యం కాని భూములు, వెంచర్లుగా మారిన భూములకు డబ్బులు చెల్లించకూడదని నిర్ణయించి వాటి గుర్తింపునకు సర్వే ప్రారంభించింది. గత నెల రోజులుగా అన్ని జిల్లాల పరిధిలో సాగులో ఉన్న భూములు, నో క్రాప్ ఏరియా గుర్తింపునకు సర్వే కొనసాగుతోంది. అంతే కాకుండా రైతువేదికల ద్వారా వీసీలు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను నేరుగా ప్రభుత్వ పెద్దలు తెలుసుకుంటున్నారు. వ్యవసాయేతర భూములుగా, రోడ్లుగా, వెంచర్లుగా, గుట్టలుగా ఉన్నవాటిని గుర్తించి పథకంలో నుంచి తొలగిస్తే నిధులభారం తగ్గడంతోపాటు వృథాను అరికట్టొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, ఐదు లేదా పది ఎకరాలకు కటాఫ్ పెట్టాలనే యోచనలో ఉంది. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది.

రుణమాఫీ తరువాతే రైతుభరోసా!

కామారెడ్డి జిల్లాలో 5,13,752 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా 3,04,804 మంది అర్హులైన రైతులు ఉన్నారు. ఇదివరకు పథకం అమలుకు జిల్లాకు దాదాపు రూ.270 కోట్ల వరకు నిధులు అవసరం ఉండేవి. నిధుల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో రుణమాఫీ హామీని అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా మారింది. దాదాపు రూ.36 వేల కోట్ల నిధులు రుణమాఫీకి అవసరం అనే అంచనాలున్నాయి. ఎలాగైనా రుణమాఫీ చేయాలనే సంకల్పంతో సర్కారు నిధుల సమీకరణపై దృష్టి సారించింది. రుణమాఫీ తర్వాతే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఉండొచ్చనే అంచనాలు కూడా ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో సదస్సులు

విధివిధానాల రూపకల్పన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఉమ్మడి జిల్లాస్థాయిలో ఈనెల 10 నుంచి 23వ తేదీ వరకు సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్‌లో ఈ నెల 18న సదస్సు నిర్వహించనున్నారు. అన్ని వర్గాల నుంచి ఈ వర్క్‌షాప్‌లలో సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

విధి విధానాలు వచ్చాకే..

ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. రైతుల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి విధివిధానాలు, నిధులు విడుదల కాగానే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటాం.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న అక్షిత్



తాడ్వాయి: భిక్కనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న అక్షిత్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాడ్వాయి మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన అక్షిత్ భిక్కనూర్‌లోని హాస్టల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. కాగా అక్షిత్ శుక్రవారం రాత్రి మలవిసర్జనకు వెళ్లగా గుర్తు తెలియని విషపురుగు కరిచింది. దీంతో అక్షిత్ ఏడవడంతో చికిత్స నిమిత్తం హాస్టల్ సిబ్బంది కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్షిత్ క్షేమంగా ఉండడంతో కుటుంబీకులు, హాస్టల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియా జీపీ పరిధిలో ఇరిగేషన్ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని అధికారులు శనివారం కూల్చివేశారు. పరదాలను అడ్డుగా వేసి లోపల పిల్లర్లతో అక్రమంగా నిర్మాణం చేపట్టిన అఫ్రోజ్ ఖాన్‌కు ఇరిగేషన్, జీపీ అధికారులు నోటీసులు పంపించినా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అక్రమం నిర్మాణం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కూల్చివేతకు యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. వెనుదిరిగిన అధికారులు శనివారం పోలీస్ బందోబస్తుతో వచ్చారు. ఇరిగేషన్ డీఈ ఈ బలరాం, ఏఈ శ్రీధర్, ఎస్సై యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



ఖలీల్‌వాడి: ఫోన్లు పోగొట్టుకున్న 14 మంది బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని అందించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు శనివారం తెలిపారు. నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, మార్కెట్, పలు రద్దీ ప్రాంతాల్లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను కనుగొని 14 సెల్‌ఫోన్లను బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ. రెండు లక్షల వరకు ఉంటుందని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

మాచారెడ్డి: అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాచారెడ్డి వాసి మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం ముస్తాపానగర్ శివారులో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డికి చెందిన జనపాల వెంకటి(52) ముస్తాబాద్ మండలం మద్దికుంటలో మృతి చెందిన బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రారంభానికి నోచుకోని ఎక్సైజ్ భవనాలు

- మోర్తాడ్, ఆర్మూర్‌లో నిర్మాణాలు పూర్తి
- భీమ్‌గల్‌లో నిధుల లేమితో పూర్తి కాని పరిస్థితి



మోర్తాడ్‌లోని ఎక్సైజ్ స్టేషన్ భవనం

మోర్తాడ్: జిల్లాలోని పలుచోట్ల ఎక్సైజ్ స్టేషన్ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం 2018లో ఎక్సైజ్ స్టేషన్లకు సొంత భవనాలను నిర్మించడానికి శ్రీకారం చుట్టింది. మోర్తాడ్, ఆర్మూర్, భీమ్‌గల్‌లో భవనాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.40లక్షల చొప్పున నిధులను విడుదల చేసింది. భవనాల నిర్మాణం పూర్తి అయినా ప్లాస్టరింగ్, కలర్స్, తలుపులు, కిటికీలు, ఇతర పనులు, ఫర్నీచర్ కోసం నిధులు అవసరం అయ్యాయి. నిధుల లేమితో భవనాలను అలాగే వదలిపెట్టారు. మోర్తాడ్‌లో సబ్ ట్రెజరీ కార్యాలయం కోసం నిర్మించిన భవనంలోనే ఎక్సైజ్ కార్యాలయాన్ని కొనసాగించారు. ఆర్మూర్, భీమ్‌గల్‌లో మాత్రం అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నారు. సొంత భవనాల నిర్మాణం సాగినా అదనంగా నిధులు ఇవ్వని కారణంగా భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చొరవ తీసుకోవడంతో మోర్తాడ్, ఆర్మూర్ భవనాల పెండింగ్ పనులను కాంట్రాక్టర్ పూర్తి చేశారు. భీమ్‌గల్ భవనానికి సంబంధించిన పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ భవనాలను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. మంత్రి షెడ్యూల్ బిజీగా ఉండటంతో భవనాల ప్రారంభం ఇప్పట్లో లేదని అనిపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఎక్సైజ్ మంత్రితో భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



ధ్రువపత్రం అందజేస్తున్న డీపీఎం సాయిలు

డిచ్‌పల్లి: మహిళలు శిక్షణలో నేర్చుకున్న మెళకువలను పాటిస్తూ స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతమై కుటుంబానికి అండగా నిలవాలని ఐకేపీ డీపీఎం సాయిలు సూచించారు. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరల్ ఈడీపీ శిక్షణ శనివారం ముగిసింది. మహిళా శక్తిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టే పని ఇస్తోందని అన్నారు. ఆర్‌ఎస్ఈటీఐ లో టైలరింగ్, కటింగ్ నేర్చుకున్న మహిళలు తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత ఆయా మండలాల పరిధిలో స్కూల్ యూనిఫామ్స్ కుట్టడం ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. స్వయం ఉపాధి, వ్యాపారం చేయాలని ఆసక్తి ఉన్న వారు బ్యాంకు రుణం కోసం మండల ఏపీఎంలను సంప్రదిస్తే రుణాలు అందిస్తామని డీపీఎం సాయిలు పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది రామకృష్ణ, భాగ్యలక్ష్మి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో డీపీఎం, ఆర్‌ఎస్ఈటీఐ సిబ్బంది

న్యాయవాద పరిషత్ అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌గౌడ్



జగన్‌మోహన్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఖలీల్‌వాడి: జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని న్యాయవాద పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పరిషత్ జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి మంగులాల్ పాల్గొని సభ్యుల అభిప్రాయాల సేకరణ అనంతరం జగన్‌మోహన్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘ్ పరివార్‌తో సుదీర్ఘంగా ఉన్న సంబంధాలను నేపథ్యంగా తీసుకుని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం జగన్‌మోహన్‌గౌడ్‌కు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు బండారి కృష్ణానంద్, పడిగల వెంకటేశ్వర్, సి సాయిరెడ్డి, మానిక్ రాజు, బిట్ల రవి, నారాయణ దాసు, విఘ్నేష్, శాస్త్రి, కేశవరావు, వసంత్ రావు, ఉదయకృష్ణ, బైరి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండలంలోని జాన్కంపల్లి ఖుర్ద్ గ్రామానికి చెందిన వసంతను వేధించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వసంతను మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన చిత్రియాల్ తండాకు చెందిన దుర్గయ్యతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది నుంచి దుర్గయ్య నిత్యం మద్యం సేవించి వసంతను వేధింపులకు గురి చేస్తున్నాడు. దుర్గయ్యతో పాటు అత్త, మామలు వేధింపులకు గురి చేస్తున్నారని వసంత ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్‌లో సరికొత్త మోసాలు

- వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ పంపి ఫోన్ల హ్యాకింగ్
- అకౌంట్‌లో డబ్బులు లేకున్నా లోన్‌లు తీసుకుని విత్‌డ్రా చేస్తున్న కేటుగాళ్లు

కామారెడ్డి అర్బన్: వాట్సాప్‌లో వచ్చే బ్యాంక్ యాప్ అంటే హడలిపోతున్నారు. గత 15రోజుల్లో కామారెడ్డి ప్రాంతానికి చెందిన పలువురు వాట్సాప్ ఏపీకే యాప్స్‌తో లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నా ఆ వివరాలు బయటికి తెలియడం లేదు. యాక్సిస్ బ్యాంకు ఖాతా ఉన్న ఓ బీమా కంపెనీ ఏజెంట్ చంద్రశేఖర్ రెడ్డికి 15రోజుల క్రితం ఏపీకే యాప్ రాగా, దాన్ని యాక్టివేట్ చేశాడు. ఆ తరువాత బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసిన ఆన్‌లైన్‌మోసగాళ్లు ఖాతాలో పెద్దగా డబ్బులు లేకపోవడంతో అతడి పేరుతో రూ.2లక్షల 71వేల లోన్ తీసుకుని దాని నుంచి రూ.61వేలు విత్‌డ్రా చేశారు. అలాగే వీక్లిమార్కెట్‌కు చెందిన రవీందర్ అనే వ్యక్తి యూనియన్ బ్యాంకు ఏపీకే యాప్‌తో ఏకంగా 12న తెల్లవారేసరికి కరెంట్ ఖాతా, సేవింగ్ ఖాతాల్లోని రూ.లక్షా 90వేలు కొట్టేశారు. ఈ వారంలోనే మాజీ బీమా అభివృద్ధి అధికారి ఖాతా నుంచి రూ.2లక్షలు కొల్లగొట్టారు. ఇలా పోలీసులకు ఫిర్యాదు చేయని వారు అనేక మంది ఉన్నట్లు తెలుస్తోంది. బ్యాంకు ఖాతాల్లోని డబ్బులను కొల్లగొట్టే హ్యాకర్లు ఇప్పుడు ఏకంగా లోన్‌లు తీసుకుంటుండడం కలవరానికి గురిచేస్తోంది. హ్యాకర్లు వేరే రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో పోలీసులకు రికవరీ పెద్ద సవాల్‌గా మారింది.

మేఘమా.. వర్షించుమా

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరులేక బోసిపోతుంది. పంటలను సాగు చేసిన రైతులు వర్షాల కోసం నిత్యం ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో శనివారం ప్రాజెక్ట్ నీటిపైన ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో ప్రాజెక్ట్ వైపు వచ్చిన ఆయకట్టు రైతులు మేఘమా వర్షించు అంటు వేడుకున్నారు. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురిపిస్తే వరదలు వచ్చి ప్రాజెక్ట్ నిండుకుండల మారుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌పై కమ్మిన కారు మబ్బులు

కోటగిరి రైస్ మిల్‌పై దాడి

- 78 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

రుద్రూర్: కోటగిరి శివారులోని బాలాజీ ట్రేడర్స్ రైస్‌మిల్‌పై సివిల్ సప్లై అధికారులు శనివారం దాడి చేసి 78 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీటీ సివిల్ సప్లై నిఖిల్ రాజ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి రైస్‌మిల్‌లో ఉన్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్ష25వేల 365 ఉంటుందని, మహారాష్ట్రలోని నాందేడ్ వివిధ ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి రైస్‌మిల్‌కు తరలించినట్లు గుర్తించారు. డీటీ సివిల్ సప్లై నిఖిల్‌రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు.

హరితం.. ఆహ్లాద భరితం

వేల్పూర్: జిల్లాలోని ప్రధాన రహదారులు పచ్చని తోరణాలుగా మారాయి. హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పెంచుతున్నాయి. వేల్పూర్ క్రాస్‌రోడ్డు 63 నంబరు జాతీయ రహదారి నుంచి వేల్పూర్ వరకు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వెంట రెండు వైపులా ఏపుగా పెరిగిన వృక్షాలు అరణ్యంలో మాదిరిగా ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జాతీయ రహదారి నుంచి అమీనాపూర్, వేల్పూర్ వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పొడవునా చెట్లు పచ్చదనం సంతరించుకున్నాయి. ఈ రోడ్డు గుండా వచ్చే ప్రయాణికులు చెట్ల కింద కొంత సేపు సేదతీరుతున్నారు. కొందరు అందమైన చెట్లతో సెల్ఫీలు తీసుకుంటున్నారు.



వేల్పూర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పచ్చదనాన్ని సంతరించుకున్న వృక్షాలు

ఉపాధ్యాయ సర్వీసు రూల్స్‌పై పోరాటం చేస్తాం



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్‌పై పోరాటం చేస్తామని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2015, జూలై నుంచి ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలు ఊరిస్తూనే వచ్చాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు, కేసులు లేకుండా ఆరు నెలల్లోనే టీచర్ల పదోన్నతులు, బదిలీలు ఆన్‌లైన్‌లోనే పారదర్శకంగా జరిగినట్లు చెప్పారు. స్కూల్ అసిస్టెంట్లను, జూనియర్ లెక్చరర్లు, ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలు, డీఈవోలుగా పదోన్నతుల కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్ సోడి, కనకపురం రవీందర్, నాగేశ్వర్‌రావు, వాసుదేవరావు, గంగాధర్, జావీద్, భూషణ్, రమణ, మనోజ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న జీహెచ్‌ఎస్ పోస్టులను అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేయాలన్నారు. జీవో 317 ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాన్నారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, స్వామి నాయక్, ప్రకాశ్ పవార్, రామ్ సింగ్, పద్మ, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అ‘పూర్వ’ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ డైట్ కళాశాలలో 1987–88లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగాలు చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు శనివారం కామారెడ్డిలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు ఉపాధ్యాయ శిక్షణ పొందిన ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన 140 మందిలో అనేక మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు గుర్తు చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో సి అర్జున్‌రావు, గంగాకిషన్, లక్ష్మి, విజయలక్ష్మి, మల్కన్న, చంద్రప్రకాశ్‌రెడ్డి, పుష్పాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ సైడ్‌వాల్‌ను ఢీకొన్న టిప్పర్

- త్రుటిలో తప్పిన ప్రమాదం



కెనాల్ సైడ్‌వాల్‌ను ఢీకొట్టిన టిప్పర్

మోపాల్: మండలంలోని తాడెం శివారులో ఉన్న నిజాంసాగర్ కెనాల్ సైడ్‌వాల్‌ను మొరం టిప్పర్ శనివారం ఢీకొన్నది. సైడ్‌వాల్‌ను ఢీకొన్న టిప్పర్ అక్కడే ఆగిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మోపాల్ నుంచి నిజామాబాద్ వైపు మొరం లోడ్‌తో టిప్పర్ వెళ్తోంది. డ్రైవర్ అతి వేగంగా టిప్పర్ నడపడంతో అదుపు తప్పి నిజాంసాగర్ కెనాల్ సైడ్‌వాల్‌ను ఢీకొని ఆగిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ సంతోష్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఒడ్డెర కాలనీ జీపీకి చెందిన గంగారాం టిప్పర్‌గా పోలీసులు గుర్తించారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీ



మద్నూర్: మండలంలోని పెద్దఎక్లార ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎంఈవో రాములు శనివారం తెలిపారు. పాఠశాలకు ఉన్న తాళాన్ని దుండగులు పగులగొట్టి కార్యాలయంలో ఉన్న రెండు కంప్యూటర్లు, రేడియోను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై సుధాకర్ పాఠశాలను పరిశీలించారు. పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిజామాబాద్ రూరల్: పాత కక్షలతో ఒకరిపై దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రూరల్ మండలంలోని మల్కాపూర్‌కు చెందిన శివప్రసాద్ గౌడ్(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన బైరి నర్సాగౌడ్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని శివప్రసాద్‌గౌడ్‌ను కట్టెతో తీవ్రంగా గాయపర్చాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకులు ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న రూరల్ ఎస్సై మహేశ్ నర్సాగౌడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా చికిత్స పొందుతున్న శివప్రసాద్ గౌడ్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పంచనామ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు రూరల్ ఇన్‌చార్జి సీఐ సతీశ్, ఎస్సై మహేశ్ తెలిపారు.

మామిడిపల్లికి చెందిన ఒకరు..

ఆర్మూర్‌టౌన్: మండలంలోని మామిడిపల్లికి చెందిన వరికుప్పల నర్సయ్య(36) జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నర్సయ్యకు అతని తమ్ముడు గంగాధర్ మధ్య ప్లాట్ విషయంలో గొడవ జరుగుతోంది. తమ్ముడు గంగాధర్ అన్న నర్సయ్యపై శుక్రవారం కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ నర్సయ్యను కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పల బాధతో హోంగార్డు ఆత్మహత్య



సంపత్(ఫైల్)

ఖలీల్‌వాడి: అప్పుల బాధతో జిల్లా కేంద్రానికి చెందిన ఓ హోంగార్డు రైలు కింద పడి ఆతహ్మత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన సంపత్(48) జిల్లా కేంద్రంలో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం బైంసాకు ఆస్పత్రికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బ్యాగుతో రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. స్టేషన్‌లోని మూడో ప్లాట్ ఫాం నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందుకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ఒకరి అదృశ్యం



భూమేశ్

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అడ్లపాటి భూమేశ్ కూలీ పని చేస్తూ జీవిస్తుంటాడు. గత నెల 19న కూలీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడైన దూరంగా పనికి వెళ్తే రెండు, మూడు రోజుల వరకు ఇంటికి వచ్చే వాడు కాదని కుటుంబీకులు తెలిపారు. రోజులు గడిచిన భూమేశ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని ఇద్దరు మృతి



రైలు పట్టాల పక్కన ఉన్న మృతదేహాలు

ఇందల్వాయి: ఇందల్వాయి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి కింద పడి గుర్తు తెలియని ఇద్దరు మృతి చెందారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మృతులు ఓ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలై మృతి చెందారని, ట్రాక్‌మెన్ సమాచారంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతులు జిల్లా కేంద్రంలోని అడ్డా కూలీలుగా పనిచేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆయన వెంట ఇందల్వాయి ఎస్సై మనోజ్, రైల్వే సిబ్బంది ఉన్నారు.

డీసీసీబీ మేనేజర్ మృతి



చండీప్రియ (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్‌లో ఉన్న ఎన్‌డీసీసీ బ్యాంక్ మేనేజర్ చండీప్రియ శనివారం మృతి చెందారు. అరుదైన బ్రెయిన్ ఫీవర్ బారిన పడిన చండీప్రియ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్వగ్రామమైన కోనాపూర్‌లో కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు సంతాపం తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ – ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు



భూపాల్ (ఫైల్)

భిక్కనూరు: మండల సమీపంలోని పెద్దమల్లారెడ్డి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన కూర్ల భూపాల్(48) ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం ఫ్యాక్టరీకి వెళ్లేందుకు బయలు దేరగా తన బైక్ రిపేరుకు గురికావడంతో తన సోదురుడి కుమారుడైన సిద్ధార్థను తన బైక్‌పై దింపేయాలని కోరాడు. దీంతో సిద్ధార్థ తనబైక్‌పై భూపాల్‌ను ఎక్కించుకొని ఫ్యాక్టరీకి వెళ్తుండగా విజయ గణపతి రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న భిక్కనూర్‌కు చెందిన హాజీపూర్ అక్షయ్ వీరిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌లపై ఉన్న భూపాల్, సిద్ధార్థ, అక్షయ్ కిందపడ్డారు. భూపాల్ తలకు తీవ్రగాయమైంది. స్థానికి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రికి వెళ్లగానే భూపాల్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ సిద్ధార్థ, అక్షయ్‌లకు వైద్యులు చికిత్స నిర్వహిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దకు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.